

ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

# 'ఈ-పాస్' పద్ధతిలోనే విక్రయాలు

- ప్రభుత్వ ధరకే ఎరువులు, విత్తనాలు
- రైతులు ఆధార్ కార్డుతోనే కొనాలి
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్
- ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీ

రామాయంపేట, జనవరి 18 : ఫర్టిలైజర్ వ్యాపారులు 'ఈ-పాస్' మిషన్‌తోనే రైతులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన విధంగా విక్రయాలు చేపట్టకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం రామాయంపేట పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో గోవింద్ మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ వ్యాపారులు వ్యాపార లావాదేవీలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వ్యాపారులు రైతుల నుంచి ఆధార్‌కార్డు తీసుకుని ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. రైతులు ఆధార్ తీసుకుని వస్తేనే ఎరువులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో రామాయంపేట, నిజాంపేట మండల వ్యవసాయాధికారులు రాజ్‌నారాయణ, సతీశ్ ఉన్నారు.

## రైస్‌మిల్లర్ అరెస్ట్..

నర్సాపూర్, జనవరి 18 : ప్రభుత్వాన్ని మోసం చేశాడనే కేసులో రైస్‌మిల్లర్ శ్రీధర్‌గుప్తాను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు.. శ్రీధర్‌గుప్తా అనే రైస్‌మిల్లర్ వడ్లను ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి, సొంత రైస్‌మిల్లుల్లో మిల్లింగ్ చేశాడు. కొనుగోలు చేసిన ధాన్యానికి సరిపడే బియ్యాన్ని ఇవ్వకపోగా, చెల్లించాల్సిన రూ.47కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని మోసం చేశారని తెలిపారు. ఈ కేసులో శ్రీధర్‌గుప్తాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని వివరించారు.

# హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలి

- అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- 2024లో 27 లక్షలు
- 2025లో 25 లక్షల మొక్కలను నాటడంపై ప్రత్యేక కార్యాచరణ
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా



మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : హరితహారంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హరితహారంపై జిల్లా అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025, 2026 వార్షిక సంవత్సరాల్లో వివిధ శాఖల ద్వారా మొక్కల పెంపకంతోపాటు నాటే లక్ష్యాలను చేరడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. లక్ష్యం సాధించాలనే తపనతో కాకుండా నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలని సూచించారు. హరితహారంలో ఔషధ మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, పూలమొక్కలు, రహదారుల వెంబడి పెద్ద మొక్కలు నాటాలన్నారు. 2024లో 27లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, 2025లో 25 లక్షల మొక్కలు నాటడానికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 2026 నాటికి 25 లక్షల మొక్కలు నాటడానికి ఇప్పటి నుంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నీటిపారుదల కట్టలు, కాల్వల వెంట ప్లాంటేషన్, అటవీశాఖ పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్, గ్రామపంచాయతీలు, విద్యాసంస్థలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థల్లో ఖాళీ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో గుర్తించి మొక్కలను నాటాలని సూచించారు. హరితహారంలో ప్రధానంగా కరివేపాకు, మునగ, ఉసిరి, చింత, వెలగ మొక్కలతోపాటు తులసీ, అలోవీరా, రణపాల తదితర ఔషధ మొక్కలు నాటాలన్నారు. కోతులు బయట సంచరించకుండా అటవీప్రాంతంలోనే పండ్ల మొక్కలు నాటాలన్నారు. ఉపాధి పథకంలో రైతులు పండ్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని, ఆయిల్ ఫామ్స్ పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. పశువులకు గడ్డి కొరత తీర్చేలా ప్లాంటేషన్ చేయాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో అంతర్గత, బహిర్గత రహదారుల వెంట, మున్సిపల్ ప్రాంతాల్లో మీడియన్‌లో పెద్ద మొక్కలతోపాటు పూలమొక్కలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లతోపాటు మునగ మొక్కలు నాటాలన్నారు. మార్కెట్ యార్డు, క్వారీలు, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, ఆర్టీవో తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద పద్ధతి ప్రకారం మొక్కలు నాటాలన్నారు. హరితహారంలో నాటిన చెట్లను కొట్టిన, తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, జడ్పీ సీఈవో శైలేశ్, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

## గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు(GPDP) తయారు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ (GPDP పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు 3 విధానాల్లో గ్రామ, మండల, జిల్లాస్థాయిలో తయారు చేయాలన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను జనవరి 27లోపు తయారు చేసి, జనవరి 31 వరకు e-గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పేదరికం, ఆరోగ్యం, పరిశుభ్రత, సుపరిపాలన, బాల బాలికల సంరక్షణ, మహిళ సాధికారతపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తాగునీటి సమస్య తీర్చడం, ఉపాధిహామీలో కూలీలకు పని కల్పించాలని, జాబ్ కార్డు ఉన్నవారికి తప్పనిసరిగా 100రోజుల పనికల్పించాలని, పెండింగ్ కూలీ డబ్బులు చెల్లించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, జడ్పీసీఈవో శైలేశ్, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబు, జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## 20, 21న ఓటరు నమోదు

**రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు**



శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారి

నర్సాపూర్, జనవరి 18 : ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రంలో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఫారం-6 ద్వారా జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులందరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం-7 ద్వారా మృతుల పేర్లతోపాటు రెండుచోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను తొలిగిస్తారన్నారు. ఫారం-8ద్వారా ఓటరు కార్డులో తప్పొప్పుల సవరణలు, దివ్యాంగుల గుర్తింపు, మొబైల్ నెంబర్ నమోదు, పోలింగ్ కేంద్రం మార్పు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా సమస్యలుంటే బూత్‌లెవల్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సూచించారు.

## ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

నర్సాపూర్, జనవరి 18 : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) నిర్వహిస్తున్న ప్రతిభా కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (2024-25) ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గురువారం మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ భిక్షమయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న గిరిజన బాలబాలికలు మాత్రమే అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా రూ.200 చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీవోఈ కళాశాలలో ఇంటర్మీడియట్‌తోపాటు ఐఐటీ-జేఈఈ, నీట్, టీఎస్ఎంసెట్ ఇతర ఉన్నత విద్యలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

## మైనార్టీ గురుకులాల్లో..

నర్సాపూర్, జనవరి 18 : నర్సాపూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల/ కళాశాలలో 5వ తరగతి, ఇంటర్‌లో (2024-25 విద్యాసంవత్సరం) చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 26లోగా ఆన్‌లైన్‌లో tmreis. telangana. cgg.gov.in వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ లేదా నేరుగా పాఠశాల/కళాశాలలో సంప్రదించాలన్నారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

రేగోడ్, జనవరి 18 : తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతిలో చేరడానికి విద్యార్థులు ఫిబ్రవరి 22లోగా దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 7 తేదీన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

## మున్నూరుకాపు సంఘం ఎన్నిక



మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు అల్లాడి వెంకటేశం

రామాయంపేట, జనవరి 18 : పట్టణంలోని సీతయ్య ఆలయంలో గురువారం మున్నూరు కాపు సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లాడి వెంకటేశం, గౌరవాధ్యక్షుడిగా అల్లాడి నారాయణ, ఉపాధ్యక్షుడిగా గాజుల బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నక్క శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కస్తూరి ఎల్లయ్య, కోశాధికారిగా బాజ రామరాజు, సభ్యులుగా మల్లేశం, నక్క పెద్ద సిద్ధిరాములు, బాజ దుర్గయ్య తదితరులను ఎన్నికున్నారు.

## ఆలయాలను శుభ్రం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 18 : ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న నేపథ్యంలో ఆలయాలను ప్రజలు శుభ్రం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్‌లోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణాన్ని బీజేపీ నాయకులతో కలిసి శుభ్రం చేశారు. మూడురోజుల పాటు స్వచ్ఛ తీర్థ అభియాన్ పేరుతో ఆలయాలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్, సతీశ్, సంగీత, రాజు, వితలేశ్, రాజు, కృష్ణ, పద్మ, గణేశ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

# 'పేట' బస్టాండ్‌లో చోరీ

- రామాయంపేట బస్టాండ్‌లో మహిళా ప్రయాణికురాలి పర్సు దొంగతనం
- ఏటీఎంలో రూ.40వేలు డ్రా చేసిన అగంతకుడు
- సీసీ కెమెరాల ద్వారా కూపీ లాగుతున్న పోలీసులు



యూనియన్ బ్యాంకు వద్ద నిల్చుని ఉన్న అగంతకుడు

రామాయంపేట, జనవరి 18: రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్సుల్లో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రామాయంపేట బస్టాండ్‌లో గురువారం మెదక్ పట్టణానికి చెందిన మహిళా ప్రయాణికురాలు బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి పర్సును చోరీచేశాడు. పర్సులో ఉన్న ఏటీఎం కార్డుతో రామాయంపేటలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో రూ.40వేలు డ్రాచేశాడు. మహిళా ప్రయాణికురాలు బస్సు ఎక్కిన తర్వాత ఆధార్‌కార్డును కండక్టర్‌కు చూపిద్దామంటే బ్యాగులో ఉన్న పర్సుతో పాటు డబ్బులు కనిపించలేదు. వెంటనే రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై రంజిత్ సీసీ కెమెరాల పరిశీలించగా.. యూనియన్ బ్యాంకు ఏటీఎంలో డబ్బులను డ్రాచేస్తున్నట్టు గమనించారు. బాధితురాలి ఫిర్యాదుతో ఎస్సై రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈవో శశిధర్‌గుప్తా, ఆలయ సిబ్బంది

## ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

శివ్వంపేట, జనవరి 18 : శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి జాతర నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి జాతర ఆహ్వానపత్రికను దేవాలయ ఈవో శశిధర్‌గుప్తా, ప్రధాన పూజారి ధనుంజయశర్మ, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి తదితరులు అందజేశారు. జనవరి 21 నుంచి మార్చి నెల వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పూజారి ధనుంజయశర్మ తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

**బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జి జక్కని సంజయ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఎస్పీ కార్యకర్తలు పని చేయాలని, పక్కా ప్రణాళికతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జి జక్కని సంజయ్ కుమార్ తెలిపారు. గురువారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష మెదక్‌లో నిర్వహించారు. సమీక్షా సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో నిర్వహించాల్సిన అంశాలపై చర్చించారు. అప్పాజిపల్లి సురేశ్‌ను బీఎస్పీ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సస్పెండ్ చేసినట్టు మెదక్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మి తెలిపారు. సమావేశంలో బీఎస్పీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి లింగంపల్లి యాదగిరి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి రోమండ్ల బాబు, మెదక్ జిల్లా అధ్యక్షుడు కుతాడి నర్సింహులు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నటరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చందనాప్రశాంత్‌రెడ్డి

## పాపన్నపేట పాఠశాలలో ఆధార్ కేంద్రం

పాపన్నపేట, జనవరి 18 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఆధార్ కేంద్రాన్ని ఎంపీపీ చందనాప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాపన్నపేటలోని ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురుమూర్తిగౌడ్, నాయకులు టీచర్లు పాల్గొన్నారు.

## ఎంపీటీసీపై అనర్హత వేటు..

వెల్దుర్తి, జనవరి 18 : తప్పుడు కుల ధృవీకరణ పత్రం సమర్పించి ఎస్టీ కోటాలో ఎంపీటీసీగా గెలుపొందిన మాసాయిపేట మండలం అచ్చంపేట ఎంపీటీసీ మూడ్ సోనీపై అనర్హత వేటు వేస్తూ జడ్పీ సీఈవో శైలేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. అచ్చంపేట ఎస్టీ రిజర్వేషన్ ఎంపీటీసీ స్థానానికి రామంతాపూర్‌తండాకు చెందిన సోనీ బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలుపొందారు. సోనీ కుల ధృవీకరణ పత్రంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అదే తండాకు చెందిన చవాన్ సాలి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ విచారణ చేపట్టి, సోనీ ఎస్టీ ధృవీకరణ పత్రాన్ని రద్దు చేసింది. దీంతో ఎస్టీ కోటాలో గెలిచిన సోనీని అనర్హురాలిగా ప్రకటిస్తూ బుధవారం జడ్పీ సీఈవో శైలేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి వెల్దుర్తి మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అచ్చంపేట ఎంపీటీసీ స్థానం ఖాళీ అయింది.

# ఆర్థిక సాయం అందజేత



రామాయంపేట : బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ భిక్షపతి

రామాయంపేట, జనవరి 18 : రామాయంపేటలో 6వ వార్డుకు చెందిన ఎర్రగొల్ల ముత్తవ్వ (80)అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ దేమె యాదగిరి మృతురాలి కటుంబ సభ్యులు గోపాల్, యాదగిరి తదితరులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

బీఆర్ఎస్‌లో కీలక నేతగా పనిచేసి అందరి మన్ననలు పొంది హఠాన్మరణం చెందిన బాధిత కుటుంబాన్ని రామాయంపేట గురువారం మండలంలోని దంతెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గొల్ల నారాయణ మృతిచెందాడు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులను ఎంపీపీ నార్సింపేట భిక్షపతి, వైస్ ఎంపీపీ స్రవంతీసిద్ధిరాంరెడ్డి తదితరులు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాట్రియాల ఎంపీటీసీ బుజ్జి, సర్పంచ్ సురేశ్, నాయకులు సార్గు భాగ్యలక్ష్మి, భిక్షపతి, చాకలి సిద్ధిరాములు, దేవేందర్ ఉన్నారు.

### అంత్యక్రియలకు..

నిజాంపేట, జనవరి 18 : మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన గరిగె అంజయ్య (55) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు చింతల స్వామి మృతుడి కుటుంబసభ్యులు పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

### జడ్పీటీసీ ఆర్థికసాయం

శివ్వంపేట, జనవరి 18 : మండలంలోని గంగాయిపల్లిలో మృతుడు హరిజన వెంకటయ్య కుటుంబానికి జడ్పీటీసీ మహేశ్‌గుప్తా ఆర్థికసాయం చేశారు. జడ్పీటీసీ అందజేసిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని గురువారం బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు పవన్‌గుప్తా, మాజీ సర్పంచ్ హరిజన సాయిలు, మన్నె శ్రీశైలం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

శేరిలింగంపల్లి, జనవరి 18 : సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు మాదాపూర్ జోన్ ట్రాఫిక్ ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ వాహనాలు, డీసీఎంలు, వాటర్ ట్యాం కర్లు, ఆర్ఎంసీ, జేసీబీ, ట్రాక్టర్ వంటి వాహనాలు ఉదయం 7:30 నుంచి 11.30 వరకు సాయంత్రం 4 నుంచి 10:30వరకు రహదారులపై ప్రయాణం నిషేధమన్నారు. నిర్మాణ సామగ్రి, డెమాలిషన్ వాహనాలు రాత్రి 10:30 నుంచి ఉదయం 6 వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. భారీ గూడ్స్, నెమ్మదిగా కదిలే భారీ వాహనాలు ఫ్లైఓవర్ల కింద ప్రయాణం నిషేధమని తెలిపారు. నిషేధ సమయాల్లో ఆయా వాహనాలు రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిసారి జరిమానా విధించి వదిలేయడంతో పాటు రెండోసారి అదే తప్పు చేస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. వారాంతాల్లో వాణిజ్య సముదాయాల ఎదుట వాహనాలు నిలిపితే వాణిజ్య సముదాయాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని వాణిజ్య సముదాయాలను గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. సైబరాబాద్ పరిధిలో 55 పెలికాన్ సిగ్నల్స్, బ్లాక్‌స్పాట్ యాక్సిడెంట్ జోన్లను గుర్తించామన్నారు.

# అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

**హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద**



రివ్యూ కమిటీ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జనవరి 18 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మెదక్ జిల్లాలోని జైళ్లలో ఉన్న ఖైదీల గురించి అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ డాక్టర్ బాలస్వామి, పీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చేగుంట, జనవరి 18 : ప్రతి విద్యార్థి ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చేగుంట డిప్యూటీ మేనేజర్ మోహన్ అన్నారు. చేగుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం బ్యాంకు సేవలను విద్యార్థులకు వివరించారు. సుకన్య సమృద్ధి యోజన, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, జీవన జ్యోతి బీమా యోజన, సేవింగ్ అకౌంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, తపస్ జిల్లా కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, రావుల వెంకటేశ్, రాథోడ్, చక్రధర్‌శర్మ, సుధాకర్‌రెడ్డి, ఈశ్వరయ్య, శారద, శ్రీవాణి పాల్గొన్నారు.




బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ మోహన్

## ఇసుకను తరలిస్తే కేసులు

వెల్దుర్తి, జనవరి 18 : వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలోని హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి మండల పరిధిలోని హల్దీవాగు నుంచి ఇసుక, మాసాయిపేట మండల పరిధిలోని గ్రామాల నుంచి ఎర్రమట్టి, మొరం మట్టిని అక్రమంగా రాత్రి వేళల్లో తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఇసుక, మట్టిని తరలిస్తూ దొరికితే వాహనాలతోపాటు డ్రైవర్లు, వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండు, మూడుసార్లు పట్టుపడితే వాహనాలను సీజ్ చేయడంతోపాటు సంబంధిత వ్యక్తులపై రౌడీషీటర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, పొలాల నుంచి మట్టిని తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపైకి కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు వస్తే కేసు నమోదు చేస్తామని డీఎస్పీ యాదగిరిరెడ్డి తెలిపారు.